సాక్షి పల్నాడు

శుక్రవారం । 28 । మార్చి । 2025



శ్రీ మడేలేశ్వర స్వామికి బోనాలు

గురజాల: మండలంలోని పులిపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ మడేలేశ్వర స్వామికి గురువారం భక్తులు బోనాలు సమర్పించారు.



ఈవీఎం గోడౌన్ తనిఖీ

ఫిరంగిపురం: రేపూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈవీఎంలు, వీవీప్యాడ్స్ భద్రపరచిన గోడౌన్‌ను డీఆర్‌ఓ ఎస్.షేక్ ఖాజావలి గురువారం తనిఖీ చేశారు.

అమ్మవార్లకు నిత్య పూజలు



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామ దేవత గోగులమ్మకు గురువారం నిత్య పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్ర)	సహర్ (శని)
నరసరావుపేట	6.27	4.51
గుంటూరు	6.25	4.49
బాపట్ల	6.25	4.49

అరాచకం..ఖాకీచకం

'స్థానిక' ఉప ఎన్నికల్లో కూటమి కుట్రలు

- అచ్చంపేటలో అడ్డదారిలో అందలం
- వైఎస్సార్ సీపీ ఎస్టీ మహిళకు టీడీపీ కండువా కప్పి ఎంపీపీగా ఎన్నిక
- వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలను హాజరుకానివ్వకుండా అడ్డుకున్న పోలీసులు
- నరసరావుపేటలో ఖాకీల సాయంతో ఎంపీటీసీల కిడ్నాప్‌కు యత్నం
- పోలీసుల తీరును నిరసిస్తూ ఎన్నికలు బహిష్కరించిన వైఎస్సార్ సీపీ
- కారెంపూడిలో కోరం లేకుండా చేసేందుకు కూటమి నేతల ఎత్తులు
- వైఎస్సార్ సీపీ ఎంపీటీసీల అపహరణ
- జిల్లాలో పలు పంచాయతీల్లో ఉప సర్పంచుల ఎన్నికలోనూ అదే తీరు
- ముక్కున వేలేసుకుంటున్న ప్రజాస్వామ్యవాదులు

ప్రజాస్వామ్య విలువల వలువలను పచ్చ గూండాలు ఒలిచేయగా.. ప్రజాప్రతినిధుల అపహరణ ప్రక్రియను ఖా'కీచకులు' విజయవంతంగా పూర్తిచేయగా.. ప్రజాస్వామ్యం నడిరోడ్డుపై వివస్త్రగా నిలబడింది. తాము అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం పాటించమని.. రెడ్‌బుక్ రాజ్యాంగం మేరకే నడుచుకుంటామంటూ కూటమి నేతలు తమ చేతలతో మరోసారి నిరూపించారు. వారికి పోలీసులు వంతపాడారు. బెదిరింపులు.. ప్రలోభాలతో జిల్లాలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికల ప్రక్రియ అపహాస్యమైంది. అచ్చంపేటలో ఒక్కరు మాత్రమే బలమున్న కూటమి నేతలు 9 మంది వైఎస్సార్ సీపీకి చెందిన ఎంపీటీసీలను కిడ్నాప్ చేసి, చివరి నిమిషంలో వారికి పచ్చకండువాలు కప్పి ఎంపీపీ పీఠంపై అక్రమంగా కూర్చోవడంపై ప్రజాస్వామ్యవాదులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నరసరావుపేటలో తమకేమాత్రం బలం లేకున్నా, అక్రమాల పర్వానికి తెరలేపి, ఖాకీల సాయంతో ఒకరిద్దరు నేతలను అపహరించారు. దీనికి నిరసనగా వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు ఎన్నికలను బహిష్కరించారు. కారెంపూడిలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఎన్నిక లాంఛనమే అయినా ఎంపీటీసీలను సమావేశంలో పాల్గొనకుండా కిడ్నాప్ చేసి కోరం లేదనే కారణంతో వాయిదా వేయించారు.



అచ్చంపేటలో సమావేశానికి వెళ్లకుండా వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలను అడ్డుకుంటున్న పోలీసులు

అచ్చంపేట/ముప్పాళ్ల/వెల్దుర్తి: వైఎస్సార్ సీపీ ఎంపీపీ భూక్యా రజనీభాయ్ గతేడాది మార్చిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాజీనామా చేయడంతో ఏర్పడ్డ ఖాళీని భర్తీ చేసేందుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. అచ్చంపేట ఎంపీపీ స్థానం ఎస్టీ మహిళకు కేటాయించబడింది. మొత్తం 17 మంది ఎంపీటీసీలుండగా 16 మంది వైఎస్సార్ సీపీ, ఒక్కరు మాత్రమే టీడీపీకి చెందినవారు ఉన్నారు. వారిలో గ్రంథశిరి ఎంపీటీసీ చిలకా జ్ఞానయ్య అనారోగ్యంతో మృతి చెందారు. మిగిలిన 16 మందితో ఎన్నిక నిర్వహించవలసి ఉంది. వీరిలో బుధవారం 9 మందిని టీడీపీ నేతలు అజ్ఞాతంలోకి తీసుకెళ్లగా ఎన్నికకు అరగంట ముందు టీడీపీ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ వారిని తీసుకొచ్చి, స్వయంగా పచ్చకండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఇంకా వైఎస్సార్ సీపీ నుంచి గెలిచినవారు ఆరుగురు ఎంపీటీసీలు మిగిలారు. వీరంతా ఉదయం 11 గంటలకే మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లగా ఆ ఆరుగురిని పోలీసులు అడ్డుకున్నారు. సమయం అయిపోయింది, మీరు వెళ్లడానికి వీల్లేదంటూ వెనక్కు పంపే ప్రయత్నం చేశారు. ఈ సమయంలోనే పోలీసులకు వైఎస్సార్ సీపీ నాయకులకు వివాదం ఏర్పడింది. ససేమిరా ఎన్నికకు వెళ్లనిచ్చే ప్రసక్తి లేదని పోలీసులు తేల్చి చెప్పడంతో గత్యంతరం లేని పరిస్థితులలో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలంతా వెనుతిరిగారు. ఉదయం 9గంటల నుంచే సత్తెనపల్లి డీఎస్పీ ఆధ్వర్యంలో అచ్చంపేటలో భారీ పోలీస్ దళాలు మోహరించాయి. 144 సెక్షను అమలు చేసి, ఎవ్వరూ గుంపులుగా ఉండకూడదంటూ హెచ్చరికలు జారీచేశారు.. ఒక ఎంపీపీని ఎన్నుకునేందుకు ఈ స్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేయడం, ఇంత హంగామా చేయడం అచ్చంపేట చరిత్రలో లేదు. బలవంతంగా తమపార్టీ ఎంపీటీసీలను చేర్చుకునేందుకు అధికార యంత్రాంగాన్ని కూటమి నేతలు దుర్వినియోగం చేశారని జడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, నెల్లూరి చంద్రబాబు, కిక్కురు అర్లారెడ్డి, ఎంపీటీసీలు గోపు అంతోనిరెడ్డి, నెల్లూరి శివకుమారి, మేకా మల్లేశ్వరి, గంగసాని నరశింహారెడ్డి, మాజీ ఎంపీపీ భూక్యా రజనీభాయి, చింతపల్లి కల్పన, తదితర నాయకులు ఆరోపించారు.

కో–ఆప్షన్ సభ్యుడి ఎన్నిక ఏకగ్రీవం

ముప్పాళ్ల మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుని ఎన్నిక ఏకగ్రీవమైంది. టీడీపీకి చెందిన మైనార్టీ నాయకుడు షేక్ అబ్దుల్ మజీద్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయటంతో ఎన్నిక ఏకగ్రీవంగా మారింది. మొత్తం 12 మంది ఎంపీటీసీ సభ్యులకు గాను ఎనిమిది సభ్యులు హాజరయ్యారు. వీరంతా వైఎస్సార్ సీపీ తరఫున గెలిచి, ఎన్నికల తర్వాత తెలుగుదేశం పార్టీలో చేరారు. కో ఆప్షన్ సభ్యుడిగా షేక్ అబ్దుల్ మజీద్ ఎన్నికైనట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో జి.కాశయ్య తెలిపారు.

రెండు గ్రామాల్లో ఏకగ్రీవం..

మండలంలోని మాదల, రుద్రవరం గ్రామాల ఉప సర్పంచ్ పదవి ఏకగ్రీవం అయ్యాయి. మాదల గ్రామ ఉపసర్పంచ్‌గా మూడవ వార్డు కు చెందిన తిరుమలశెట్టి సైదుబాబు(జనసేన) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉమర్‌ఫరూక్ తెలిపారు. రుద్రవరం గ్రామ ఉపసర్పంచ్‌గా రెండవ వార్డుకు చెందిన పులిచర్ల అప్పారావు(టీడీపీ) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి పీఆర్ ఏఈ నాగేశ్వరరావు తెలిపారు.



అచ్చంపేట ఎంపీపీగా గెలుపొందినట్లు డిక్లరేషన్ తీసుకుంటున్న భూక్యా స్వర్ణమ్మభాయి

బోదిలవీడు ఉపసర్పంచి ఏకగ్రీవం

వెల్దుర్తి మండలంలోని బోదిలవీడు గ్రామంలో పంచాయతీ ఉప సర్పంచ్‌గా ధర్మవరపు శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి పాశం శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ వార్డు మెంబర్‌గా గెలిచిన శ్రీనివాసరావు టీడీపీ ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు.

న్యూస్‌రీల్

జిల్లాలో 39 పంచాయతీ ఉప సర్పంచ్‌లకు ఎన్నికలు

నాలుగుచోట్ల కోరం లేక నేటికి వాయిదా

నరసరావుపేట: జిల్లాలో గురువారం 43చోట్ల గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ పదవులకు ఎన్నికలు నిర్వహించగా నాలుగు మినహా మిగతా 39 చోట్ల అభ్యర్థులను ఎన్నుకున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి ఎంవీ భాస్కరరెడ్డి వెల్లడించారు. కోరంలేక రొంపిచర్ల మండలం తురుమెళ్ల, మాచవరం మండలం మాచవరం, పిన్నెల్లి, పిడుగురాళ్ల మండలంలోని కొత్తవెల్లంపల్లి గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నికను శుక్రవారానికి వాయిదా వేసినట్లు తెలిపారు.

31లోగా ఎక్స్‌గ్రేషియో క్లెయిమ్‌లకు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట: అసంఘటిత రంగ కార్మికుల ఎక్స్‌గ్రేషియో క్లెయిమ్‌ల పరిష్కారానికి, జిల్లా మెజిస్ట్రేట్ ఆమోదించిన క్లెయిమ్‌లు ఈ-శ్రమ పోర్టల్ ద్వారా స్వీకరించేందుకు ఈనెల 31వ తేదీ వరకు గడువును పొడిగించినట్లు జిల్లా సహాయ కార్మిక కమిషనర్ జి.ధనలక్ష్మి పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర ఉపాధి కార్మికశాఖ తెలియచేసినట్లు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. సెటిల్‌మెంట్ ప్రక్రియ నియమ నిబంధనలు, షరతుల్లో ఏ మార్పులు లేవన్నారు. ఈ-శ్రమ పోర్టల్‌లో నమోదై 2022 మార్చి 31లోపు ప్రమాదవశాత్తు మృతిచెందిన కార్మికులు, శాశ్వత అంగవైకల్యం పొందిన వారు ఎక్స్‌గ్రేషియో లబ్ధిపొందేందుకు ఆన్‌లైన్‌లో వారి డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయాలన్నారు. ఇందులో నమోదుచేసుకున్న ప్రతి కార్మికుడికి రూ.2లక్షల ప్రమాద, అంగవైకల్య బీమా ఉచితంగా కల్పించటం జరుగుతుందన్నారు.

పరమ పదనాథుడు అలంకారంలో నృసింహుడు



మంగళగిరి టౌన్: మంగళాద్రిలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాల్లో భాగంగా గురువారం పరమ పద నాథుడు అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ ఈవో రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

వట్టిచెరుకూరు హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయండి

మంత్రి సవిత ఆదేశం

సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు బీసీ హాస్టల్ విద్యార్థి కిశోర్ చెరువులో పడి దుర్మరణం పాలవ్వడంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు మంత్రి కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులపై పర్యవేక్షణ లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన హాస్టల్ వార్డెన్ శారదారాణిని తక్షణమే సస్పెండ్ చేయాలని మంత్రి ఆదేశించారు. చేతికందికొచ్చిన కొడుకు మృతి చెందడం బాధాకరమని, మృతుడి తల్లిదండ్రుల కడుపుకోత వర్ణనాతీతమని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి తల్లిదండ్రులకు మంత్రి సవిత తన ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు. దుర్ఘటనకు గల కారణాలపై విచారణకు ఆదేశించామని తెలిపారు.

గిరిజన విద్యార్థులు చదువుల్లో రాణించాలి

వేటపాలెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయాల ప్రాంగణలో గల గిరిజన ఆశ్రమ పాఠశాలను రాష్ట్ర ఎస్టీ చైర్మన్, కమిషనర్ డీవీజీ శంకరరావు గురువారం పరిశీలించారు. విద్యార్థులను పాఠశాలల్లో అందుతున్న వసతులు, భోజన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాల భవనాన్ని పరిశీలించారు. భోజనాలను పరిశీలించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి ప్రతిభను తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా గిరిజన ఆశ్రమ పాఠశాలలను పరిశీలించినట్లు తెలిపారు. వీరికి తహసీల్దార్ పార్వతి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

బెడిసి కొట్టిన 'నకిలీ'లలు

నరసరావుపేట రూరల్: మండల పరిషత్ ఉపాధ్యక్ష ఎన్నిక కోరం లేకపోవడంతో శుక్రవారానికి వాయిదా పడింది. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎన్నికల అధికారి ఐ.మురళి అధ్యక్షతన గురువారం మండల పరిషత్ ఉపాధ్యక్ష ఎన్నిక ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉదయం 11గంటలకు ప్రారంభమైన సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో పాటు ఐదుగురు ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు. ఎంపీటీసీ సభ్యులపై పోలీసుల బెదిరింపులకు నిరసనగా వైఎస్సార్ సీపీ ఎన్నికను బహిష్కరించింది. మొత్తం 16 మంది సభ్యులున్న మండల పరిషత్‌లో సమావేశం నిర్వహించాలంటే తొమ్మిది మంది సభ్యులు గల కోరం అవసరం ఉంది. మధ్యాహ్నం 12 గంటలకు ప్రత్యేక సమావేశం సమయం పూర్తయింది. దీంతో కోరం లేకపోవడంతో శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్టు ఎన్నికల అధికారి ఐ.మురళి ప్రకటించారు. శుక్రవారం 11గంటలకు ప్రత్యేక సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు.

నకిలీ ఎంపీటీసీలతో నిర్వహించే కుట్ర..



కార్యాలయంలో టీడీపీ నాయకుల హల్‌చల్

నకిలీ ఎంపీటీసీ సభ్యులతో మండల పరిషత్ ఉపాధ్యక్ష పదవిని కైవసం చేసుకునేందుకు టీడీపీ ప్రయత్నించింది. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు అక్రమాలకు పాల్పడ్డారు. సమావేశానికి కేవలం ఐదుగురు సభ్యులే హాజరుకావడంతో కోరంకు అవసరమైన మిగిలిన నలుగురిని నకిలీ సభ్యులను సమావేశ హాల్‌లోకి తీసుకువచ్చే యత్నాలు చేశారు. మొదట దొండపాడు ఎంపీటీసీ సభ్యురాలు పేరుతో మహిళ సమావేశ మందిరానికి వచ్చింది. ఎన్నికల అధికారికి అనుమానం రావడంతో ఐడీలోని ఫొటోలు, వివరాలను పరిశీలించారు. సమావేశానికి వచ్చిన మహిళ ఫేక్‌గా నిర్ధారించి బయటకు పంపారు. అలాగే జొన్నలగడ్డ ఎంపీటీసీ పేరుతో వచ్చిన మరో మహిళను అధికారులు వెనక్కి పంపారు. ఉదయం 9గంటల నుంచే టీడీపీ నాయకులు మండల పరిషత్ కార్యాలయంలో పెద్ద సంఖ్యలో తిష్టవేశారు. పక్కనే ఉన్న పంచాయతీ రాజ్ శాఖ కార్యాలయం, శంకరమఠం పరిసరాల్లో వందలాది మంది వచ్చి చేరారు. డీఎస్పీ నాగేశ్వరరావు, సీఐ చరణ్, ఎస్ఐలు అక్కడే ఉన్నా పోలీసులు వీరిని నిలువరించే ప్రయత్నాలు చేయలేదు.



నకిలీ ఎంపీటీసీని బయటకు పంపుతున్న ఎన్నికల అధికారి మురళి

వైఎస్సార్ సీపీ నాయకుల కిడ్నాప్

మండల పరిషత్ ఉపాధ్యక్ష ఎన్నిక నేపథ్యంలో మంగళవారం రాత్రి పలువురు వైఎస్సార్ సీపీ నాయకులను పోలీసులు కిడ్నాప్ చేశారు. ఎంపీపీ ఎం.సుబ్బాయమ్మ భర్త శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తన్నీరు శ్రీనివాసరావు, పాలపాడు ఎంపీటీసీ మెట్టు రామిరెడ్డిలను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. వీరిలో పాలపాడు ఎంపీటీసీ రామిరెడ్డి గురువారం ఉపాధ్యక్ష ఎన్నికకు హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ నాయకుల అపహరించి అక్రమంగా నిర్బంధించడంపై హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటీషన్‌ను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గురువారం దాఖలు చేశారు. హైకోర్టు నుంచి నోటీసులు అందడంతో అప్రమత్తమైన పోలీసులు వైఎస్సార్ సీపీ నాయకులను సాయంత్రం విడిచిపెట్టారు.

కారెంపూడిలో కోరం లేక వాయిదా

కారెంపూడి: కారెంపూడి వైస్ ఎంపీపీ ఎన్నిక వాయిదా పడింది. ఎన్నిక నిర్వహణకు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి సభ్యులెవరూ హాజరు కాలేదు. ఉదయం 11 గంటలకు ఎన్నిక జరగాల్సి ఉండగా సభ్యులు రాకపోవడంతో ఎన్నికల ప్రత్యేక అధికారి మరో గంట సమయం కేటాయించారు. మధ్యాహ్నం 12 గంటల వరకు ఎవరూ రాకపోవడంతో ఎన్నికల అధికారి, డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి ఎన్నికను వాయిదా వేశారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరుగుతాయని ఎన్నికకు హాజరుకాలేమని వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు హైకోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు ఆదేశాల మేరకు పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. జేసీ, ఇతర అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ వాసు ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. మండల పరిషత్తులో 15 మంది ఎంపీటీసీలుండగా వారిలో వేపకంపల్లి ఎంపీటీసీ వైస్ ఎంపీపీ కోకా అక్కమ్మ మృతి చెందారు.



మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

మరో వైఎస్సార్ సీపీ పేటసన్నెగండ్ల ఎంపీటీసీ గాడిపర్తి రమాదేవి గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో టీడీపీలోకి వెళ్లారు. ఒప్పిచర్ల వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ గత గురువారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీకి ఇద్దరు ఎంపీటీసీలుండగా మిగతా అందరూ వైఎస్సార్ సీపీకి చెందినవారే. వాస్తవానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థి కొమ్మిరెడ్డి విజయ ఎన్నిక లాంఛనమే. అయితే వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు హాజరు కాకపోవడమే పెద్ద చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో వీరిలో కొందరు టీడీపీలోకి టచ్‌లోకి వెళ్లారనే ప్రచారంతో పాటు ఎన్నికను సామరస్యంగా నిర్వహించుకుందామని రాయబారాలు నెరపుతున్నట్లు సమాచారం.

ఎన్నికైన ఉప సర్పంచ్‌లు..

ఇదిలా ఉంటే గురువారం మండలంలోని గ్రామ పంచాయతీలకు ఉప సర్పంచ్‌ల ఎన్నికలు కూడా జరిగాయి. అన్ని చోట్ల కూడా గతంలో వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నా కూడా టీడీపీ బలపరచిన అభ్యర్థులు ఉప సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. కారెంపూడి ఉప సర్పంచ్‌గా బాణావతు సరస్వతీభాయి, నరమాలపాడు ఉప సర్పంచ్‌గా షేక్ ఆసిమా, ఒప్పిచర్ల ఉప సర్పంచ్‌గా గంగనపల్లి పుష్పలత, ఇనుపరాజుపల్లె ఉప సర్పంచ్‌గా రత్నమేరి, చింతపల్లి ఉప సర్పంచ్‌గా ఉన్నం మాధవి, పేటసన్నెగండ్ల ఉప సర్పంచ్‌గా తోడేటి రాజేశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎన్నికయ్యాక టీడీపీ కండువా కప్పి..

కోనంకి ఉప సర్పంచి ఎన్నికల్లో టీడీపీ నేతల వైచిత్రి

పిడుగురాళ్లరూరల్: మండలంలోని కోనంకి గ్రామం పంచాయతీ కార్యాలయంలో గురువారం ఉప సర్పంచ్ ఎన్నిక జరిగింది. గతంలో వైఎస్సార్ సీపీ మొత్తం 12 వార్డులను గెలుచుకుంది. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇద్దరు టీడీపీలోకి వెళ్లారు. మూడవ దఫాలో సర్పంచ్‌గా వైఎస్సార్ సీపీకి చెందిన 9వ వార్డు మెంబర్ ఇర్లా సాంబయ్యకు ఇస్తామని పెద్దలు వాగ్దానం చేశారు. ఈమేరకు గురువారం ఉప సర్పంచ్‌గా ఇర్లా సాంబయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అయితే ఉదయం వైఎస్సార్ సీపీకి చెందిన 9 మంది వార్డు మెంబర్లు పంచాయతీ కార్యాలయంలోకి వెళ్లారు. అయితే ఇర్ల సాంబయ్యను టీడీపీ నాయకులు బుధవారం రాత్రి నుంచే కనిపించకుండా చేసి తీరా ఎన్నిక సమయానికి తీసుకొని వచ్చారు. మరో ఇద్దరు టీడీపీకి మద్దతు తెలిపేవారితో కలిసి ఎన్నికకు వెళ్లారు. మొత్తం 12 మంది వార్డు మెంబర్లు సమావేశానికి హాజరై ఇర్లా సాంబయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వెంటనే వైఎస్సార్ సీపీ వార్డు మెంబర్లు బయటకు వెళ్లిపోగా సాంబయ్యను టీడీపీ నాయకులు ఆపి వెంటనే పంచాయతీ కార్యాలయంలోనే తెలుగు దేశం పార్టీ కండువా కప్పారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ వార్డు మెంబర్లు సాంబయ్య టీడీపీ కండువా కప్పుకుంటే తాము త్వరలో పంచాయతీ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానం పెట్టి మరొకరిని ఎన్నుకుంటామని, నాడు ఇచ్చిన మాట ప్రకారం సాంబయ్యకు నేడు ఉప సర్పంచ్ పదవి ఇవ్వటం జరిగిందని వారు తెలియజేశారు.

- కామేపల్లి గ్రామంలో టీడీపీకి చెందిన 1వ వార్డుకు చెందిన రొండి మంగమ్మను ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
- న్యూ వెల్లంపల్లికి పంచాయతీకి 8 వార్డు మెంబర్లు, ఒక సర్పంచ్ ఉండగా అందరినీ కూటమి నేతలు, పోలీసుల ద్వారా బెదిరింపులకు దిగటంతో వారు ఏం చేయాలో అర్థంకాక ఇంట్లో భార్య, పిల్లలతో సహా ఊరి వదిలి వెళ్లిపోయారు. దీంతో కోరం లేక ఎన్నిక వాయిదా వేసినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

పోలీసుల తీరుకు నిరసనగా బాయ్‌కాట్

- పార్టీ కార్యాలయం నుంచి బయటకు వస్తే బలవంతంగా తీసుకెళ్లేందుకు పోలీసులు నిఘా
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



మాట్లాడుతున్న గోపిరెడ్డి

నరసరావుపేట: నియోజకవర్గంలో పోలీసుల తీరుకు నిరసనగా నరసరావుపేట మండల ఉపాధ్యక్ష ఎన్నికలు, రొంపిచర్ల మండలం తురుమెళ్ల గ్రామ ఉపసర్పంచ్ ఎన్నికలను బాయ్‌కాట్ చేస్తున్నామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. జిల్లా ఎస్పీ కార్యాలయానికి సుమారు 200 మీటర్ల దూరంలో పోలీసులు అనుసరిస్తున్న అప్రజాస్వామ్యమైన విధానాలను ప్రజాస్వామ్యవాదులు అందరూ ఖండించాలని కోరారు. గురువారం పార్టీ కార్యాలయం బయట పోలీసులు తమ వాహనాలతో కాపుకాయటాన్ని నిరసిస్తూ ఆయన మీడియాతో మాట్లాడారు. స్థానిక మండల పరిషత్ ఉపాధ్యక్ష ఎన్నికలకు మొత్తం ఎంపీటీసీలు 16మంది కాగా వారిలో వైఎస్సార్ సీపీకి 15మంది ఉంటే, టీడీపీకి కేవలం ఒకే ఒక్క ఎంపీటీసీ స్థానం ఉందని,ఆ పార్టీ వారు ఆ ఒక్క సీటుతో ఏవిధంగా గెలుద్దామనుకుంటున్నారని ప్రశ్నించారు.



డాక్టర్ గోపిరెడ్డి హాస్పిటల్, పార్టీ కార్యాలయం ముందు తిష్టవేసిన పోలీసులు

బెదిరింపులు.. ప్రలోభాలు

బుధవారం నుంచి పోలీసులు తమ పార్టీకి చెందిన ఎంపీటీసీలను ఫోన్‌ల ద్వారా వేధింపులు, వారి కుటుంబ సభ్యులను తీసుకెళ్లి ఒత్తిడికి గురిచేస్తున్నారని అన్నారు. ఎంపీపీ భర్త మూరబోయిన శ్రీనివాసరావును బుధవారం ఏడు గంటల సమయంలో సీఐ, ఎస్ఐ ఇద్దరూ అక్రమంగా నిర్బంధంలోకి తీసుకున్నారని, అర్ధరాత్రి 12 గంటలకు తమ పార్టీ మండల కన్వీనర్ తన్నీరు శ్రీనివాసరావును పోలీసులు అక్రమ నిర్బంధం చేశారన్నారు. వారిని టీడీపీకి మద్దతు తెలపాలని, లేని పక్షంలో కేసులు పెడతామంటూ భయాందోళనలకు గురిచేస్తున్నారని అన్నారు. దీనిని బట్టి నరసరావుపేటలో పోలీసులే ఎలక్షన్ చేస్తున్నారని అర్థమవుతుందన్నారు. గురువారం ఉదయం 8:30 గంటలకు పోలీసుల జీపు తమ హాస్పిటల్ గేటు ముందు పెట్టారన్నారు. అదేమంటే మేము మీ రక్షణకోసమే అంటున్నారని తెలిపారు. పోలీసుల తీరుకు నిరసనగా ఈ ఎన్నికలను బాయ్‌కాట్ చేస్తున్నామని స్పష్టం చేశారు.

పోలీసులే ఇలా చేస్తే ఇంకెవరికి చెప్పుకోవాలి.. ?

పోలీసులే అపహరణలకు పాల్పడుతున్న ఘటనలపై కలెక్టర్, ఎస్పీలు ఎందుకు స్పందించడం లేదని, వాళ్ల కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతుందన్నారు. పోలీసులే ప్రజాప్రతినిధుల్ని కిడ్నాప్ చేస్తుంటే, ఇక తామెవరికీ చెప్పుకోవాలన్నారు. నరసరావుపేటలో చివరకు ప్రజాస్వామ్యమే విజయం సాధిస్తుందన్నారు. రొంపిచర్ల మండలం అలవాలలో ఒక మహిళా వార్డు మెంబర్ పొలంలో ఉంటే ఆమెను నిర్బంధంలోకి తీసుకోవడానికి పోలీసులు యత్నించారని, ఆమె వాళ్లకి నమస్కారం చెప్పి రోడ్డుమీద కూర్చొని నిరసన తెలిపితే భయపడి వదిలేసి వెళ్లిపోయారన్నారు. పోలీసులు చేస్తున్న అరాచకాలను తాము గుర్తు పెట్టుకుంటామన్నారు. జెడ్పీటీసీ సభ్యులు పదముత్తం చిట్టిబాబు, కందుల ఎజ్రా, షేక్ కరిముల్లా, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇద్దరు వైఎస్సార్ సీపీ నాయకులకు రాష్ట్రస్థాయి పదవులు



నరసరావుపేట: జిల్లాకు చెందిన ఇరువురు వైఎస్సార్ సీపీ నాయకులకు రాష్ట్రస్థాయిలో పదవుల్లో నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సత్తెనపల్లి నియోజకవర్గానికి చెందిన డాక్టర్ గజ్జల నాగభూషణరెడ్డిని పార్టీ రాష్ట్ర డాక్టర్ల విభాగం ప్రధాన కార్యదర్శిగా, మాచర్ల నియోజకవర్గానికి చెందిన మాచర్ల సుందరరావును రాష్ట్ర ఎస్సీ విభాగం సంయుక్త కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

రైతుల సమక్షంలో రీసర్వే చేయండి

జాయింట్ కలెక్టర్ గనోరే సూరజ్



నరసరావుపేట: రీసర్వే చేసే సమయంలో రైతులను పిలిపించుకొని కొలతలు, హద్దురాళ్లు, బౌండరీలు సక్రమంగా చేపట్టాలని, ఎవరిని నొప్పించకుండా అందరితో సక్రమంగా మాట్లాడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ గనోరే సూరజ్ ధనుంజయ సూచించారు. గురువారం కలెక్టరేట్ నుంచి నిర్వహించిన వీడియా కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని డీఎస్ఓ, మూడు రెవెన్యూ డివిజన్ ఆర్డీఓలు, అన్ని మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దారులు, మండల సర్వేయర్లు, వీఆర్వోలతో రీసర్వే పనులు, రెవెన్యూ సమస్యలు, పౌరసరఫరాల విషయాలపై మాట్లాడారు. రెవెన్యూ విషయాల్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే విషయాన్ని ఆర్డీఓ, తహసీల్దార్, ఏడీ సర్వేయర్‌తో చర్చించాల్సి ఉందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం, నిత్యావసరాల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు.

మా రూటే.. సెప రేటు

- రూటు మార్చి గ్రానైట్ అక్రమ రవాణా
- ఒక్కో జీరో బిల్లు లారీకి రూ.3,500 చొప్పున వసూలు చేస్తున్న టీడీపీ నేతలు
- రోజుకు 50 – 60 లారీలు దారి మళ్లింపు
- ముప్పాళ్ల మీదుగా ఇతర ప్రాంతాలకు తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి



ముప్పాళ్లలో నిలిపివేసిన లారీలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: జీరో బిల్లులతో గ్రానైట్ లారీల తరలింపు రూటు మారింది. గతంలో నకరికల్లు మీదుగా పిడుగురాళ్ల బాట పట్టిన లారీలు అధికారుల తనిఖీలు పెరిగాయంటూ ముప్పాళ్ళ, సత్తెనపల్లి, రాజుపాలెం, కొండమోడు మీదుగా హైవే ఎక్కేలా చేస్తున్నారు. ఒక్కో లారీ నుంచి ముప్పాళ్ళ వద్ద రూ.3,500, కొండమోడు వద్ద రూ.3,500 చొప్పున నియోజకవర్గ టీడీపీ నాయకుడి పేరుతో అక్రమ వసూలు చేపడుతున్నారు. నియోజకవర్గ టీడీపీ నాయకులకు, దందా నిర్వాహకుల మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా రూ.6వేలు నుంచి రూ.3,500కి తగ్గింది. ఒక వేళ వారికి ఇవ్వాల్సిన రూ.3,500 ఇవ్వకుంటే లారీని అక్కడే నిలిపివేసి దగ్గర్లోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించి వారిపై కేసు నమోదు చేయిస్తారు.

నిత్యం 50 నుంచి 60 లారీలు...

నకరికల్లు – కొండమోడు దారిలో సేల్ టాక్స్(జీఎస్టీ) డీసీటీఓ స్థాయి అధికారి ప్రత్యేక తనిఖీలు చేస్తుండటంతో అక్రమ రవాణాను దారి మళ్లించారు. అందుకు నరసరావుపేట – సత్తెనపల్లి మార్గంను ఎంచుకున్నారు. నిత్యం 50 నుంచి 60 లారీలు నరసరావు పేట నుంచి సత్తెనపల్లి మీదుగా కొండమోడు వైపు తరలివెళుతున్నాయి. అన్నీ జీరో బిల్లు గ్రానైట్ లారీలే కావటం గమనార్హం. ప్రభుత్వానికి అందాల్సిన సొమ్మును టీడీపీ నాయకులు చెరబడుతున్నారు. ఒక్కో లారీకి రూ.లక్షన్నర వరకు జీఎస్టీ, రూ.లక్షన్నర వరకు మైనింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. రోజుకి 60 లారీలు చొప్పున రోజుకి రూ.1.80కోట్లు, నెలకు సుమారు రూ.54కోట్ల మేర ప్రభుత్వానికి ఆదాయం రావాల్సి ఉంది. కేవలం రూ.3,500 తీసుకుంటూ లారీలను దారి మళ్లిస్తూ ప్రభుత్వ ఖజానాకు టీడీపీ నేతలు గండి కొడుతున్నారు.

నా దృష్టికి రాలేదు..

ముప్పాళ్ల మీదుగా జీరో బిల్లు గ్రానైట్ లారీల రవాణా, టీడీపీ నేతల అక్రమ వసూళ్లపై సత్తెనపల్లి సర్కిల్ డీసీటీఓ కనికిరెడ్డిని వివరణ కోరగా లారీలు వెళుతున్న విషయం తనకు తెలియదని, తన దృష్టికి రాలేదని చెప్పారు.

సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ‘గంగూరి’



గంగూరి అజయ్‌కుమార్



చిన్నం మణిబాబు



బయ్యవరపు నరసింహారావు



షేక్ జానీ ఖాజావలి

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా న్యాయవాది గంగూరి అజయ్‌కుమార్ గెలుపొందారు. పట్టణంలోని న్యాయవాదుల సంఘం ప్రాంగణంలో గురువారం 2025–26 సంవత్సరానికి బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4.30 గంటల వరకు జరిగింది. మొత్తం 146 మంది న్యాయవాదులకు ఓటు హక్కు ఉండగా 139 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం 5 గంటలకు కౌంటింగ్ ప్రక్రియను ప్రారంభించగా రాత్రి 8 గంటల వరకు జరిగింది. అనంతరం ఎన్నికల ఫలితాలను ఎన్నికల ప్రధాన అధికారి గుజ్జర్లపూడి మార్కురావు, సహాయ ఎన్నికల అధికారి ఎస్.ఆంజనేయులు వెల్లడించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి 146 ఓట్లకు గాను 139 ఓట్లు పోలవ్వగా గంగూరి అజయ్ కుమార్‌కు 85 ఓట్లు రాగా ప్రత్యర్థి చిలుకా చంద్రశేఖర్‌కు 52 ఓట్లు, నోటాకు రెండు ఓట్లు వచ్చాయి. 33 ఓట్ల మెజార్టీతో గంగూరి అజయ్‌కుమార్ విజయం సాధించారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్ష పదవికి 146 ఓట్లకు గాను 139 ఓట్లు పోలు కాగా చిన్నం మణి బాబుకు 69 ఓట్లు రాగా ప్రత్యర్థి సర్వేపల్లి సీతారామాంజనేయులు (సీతయ్య)కు 68 ఓట్లు, నోటాకు రెండు ఓట్లు వచ్చాయి. ఒక్క ఓటు మెజార్టీతో చిన్నం మణిబాబు ఉపాధ్యక్షుడిగా విజయం సాధించాడు. 2022–23లో కూడా చిన్నం మణిబాబు ఉపాధ్యక్షుడిగా గెలుపొందారు. సెక్రటరీ పదవికి 146 ఓట్లకు గాను 139 ఓట్లు పోలవ్వగా బయ్యవరపు నరసింహారావుకు 74 ఓట్లు, ప్రత్యర్థి పొత్తూరి హరిమణికంఠకు 64 ఓట్లు, నోటాకు ఒక ఓటు వచ్చాయి. సబ్‌కోర్టు సెక్రటరీగా 19 ఓట్ల మెజార్టీతో షేక్ జానీ ఖాజావలి విజయం సాధించాడు. గెలుపొందిన వారికి ఎన్నికల ప్రధాన అధికారి గుజ్జర్లపూడి మార్కురావు, సహాయ ఎన్నికల అధికారి ఎస్.ఆంజనేయులు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎన్నికలు సజావుగా జరగడానికి సహకరించిన బార్ అసోసియేషన్ న్యాయవాదులకు ఎన్నికల అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విజేతలను పలువురు న్యాయవాదులు ప్రత్యేకంగా అభినందించారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలన



ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలిస్తున్న డీపీఎం అమలకుమారి, సిబ్బంది

బెల్లంకొండ: ప్రకతి వ్యవసాయ విధానంలో మండలంలో సాగు చేస్తున్న వరి, కంది, కూరగాయల క్షేత్రాలను గురువారం పలు జిల్లాలకు చెందిన వ్యవసాయ, వెలుగు, ప్రకృతి వ్యవసాయ అధికారులు పరిశీలించారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల పాటు వీరికి శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రకతి వ్యవసాయ క్షేత్రాలకు వీరిని తీసుకువెళ్లి డీపీఎం అమల కుమారి వివరించారు. బీజామృతం, విత్తన గుళికలు, ద్రవ జీవామతం, ఘనజీవామృతం, నీమాస్త్రం తయారు చేస్తున్న విధానాలను మహిళా రైతులు వారికి వివరించారు. కంది పంటలో ఏ గ్రేడ్ మోడల్ వ్యవసాయ క్షేత్రాన్ని చూపించి, కంది పంటలో ఐదు నుండి పది రకాల అంతర పంటలు వేయడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం చేకూరుతుందని తెలిపారు. నిరంతరం ఆదాయం ఇచ్చే ఏటీఎం మోడల్ సూర్య మండలం మోడల్‌లో 27 రకాల కూరగాయల పంటలను రైతుల పండిస్తున్నట్లు తెలిపారు. భూమిలో వివిధ రకాల పంటలు వేయడం వలన జీవవైవిధ్యం పెరిగి భూమి సారవంతం అవుతుందని పేర్కొన్నారు. వరి పొలం గట్లపై అరటి, కొబ్బరి, బొప్పాయి, జామ, బంతి పలు రకాల చెట్లను నాటడాన్ని వివరించారు. కందిపాడు గ్రామంలో రైతు నాగమల్లేశ్వరరావు సాగు చేస్తున్న ప్రధాన పంట దొండ పందిరి తోటను, అందులో అంతర పంటలుగా వేసిన టమోటో బంతి చిక్కుడు ఆముదం పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజ్, మండల వ్యవసాయ అధికారి కృష్ణయ్య, ప్రకతి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

చిలకలూరిపేటటౌన్: బైపాస్‌పై ఎదురుగా వస్తున్న లారీని బైక్ ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృత్యువాత పడగా, మరొకరికి గాయాలైన సంఘటన పట్టణంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ప్రకాశం జిల్లా కొనికమెట్ల మండలం సిద్ధవరం గ్రామానికి చెందిన చప్పిడి రమేష్‌బాబు, చప్పిడి చినబాబులు విజయవాడలోని గుణదల మేరీమాత చర్చికు బుధవారం రాత్రి బైక్‌పై బయలుదేరారు. గురువారం తెల్లవారుజామున చిలకలూరిపేట పట్టణంలోని పోలిరెడ్డిపాలెం సమీపాన ఉన్న బైపాస్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీని ప్రమాదవశాత్తు బైక్ ఢీకొట్టారు. తెల్లవారుజామున 3.45 గంటలకు జరిగిన ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న రమేష్‌బాబు(25) అక్కడికక్కడే మృతి చెందగా, చినబాబుకు గాయాలయ్యాయి. మృతుడి తండ్రి అర్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రమేష్‌బాబుకు రెండేళ్ల కిందట వివాహమై కుమారుడు ఉండగా, భార్య సాయితిరుమల ప్రస్తుతం గర్భిణీగా ఉంది.

సీపీఎస్ ఉద్యోగుల మ్యాచింగ్ గ్రాంట్ జమ

భట్టిప్రోలు: ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ వినతి మేరకు ఫిబ్రవరి 2025 వరకు సీపీఎస్ నెల వారి చందాను ప్రతి నెలా ఉద్యోగుల ఆయా పీఆర్‌ఏఎన్ అకౌంట్లకు జమ చేయడం జరుగుతుందని జిల్లా అధ్యక్షులు గుర్రం మురళీమోహన్ గురువారం తెలిపారు. సీపీఎస్ ఉద్యోగులకు రావాల్సిన డీఏ బకాయిలు కూడా వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

జీడీసీఎంఎస్‌ను ప్రథమ స్థానంలో నిలపాలి

పర్సన్ ఇన్‌చార్జి, జేసీ భార్గవ్ తేజ



జీడీసీఎంఎస్ అంచనా బడ్జెట్‌ను చదివి వినిపిస్తున్న బిజినెస్ మేనేజర్ హరిగోపాలం, పక్కన జేసీ

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(జీడీసీఎంఎస్)ను అన్ని రంగాల్లో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలని పర్సన్ ఇన్‌చార్జి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ తెలిపారు. స్థానిక కన్నావారితోటలోని జీడీసీఎంఎస్ కార్యాలయంలో గురువారం జరిగిన మహాజన సభ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్)ను లాభాల్లో నడిపించాలని చెప్పారుఉ. ముందుగా బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం 2025–26 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.6.21 కోట్లతో అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా, సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2024–25లో జిల్లాలోని 44 జీడీసీఎంఎస్ బ్రాంచీలు, పలు పీఏసీఎస్‌ల ద్వారా రూ.81 కోట్లు విలువైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, నోటు పుస్తకాలు, స్టేషనరీ, ప్రొవిజన్స్ తదితర వ్యాపారాలు చేసినట్లు పేర్కొన్నారు. 2024–25 ఖరీఫ్ సీజన్‌లో ఏపీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని 12 మండలాల్లో రూ.280 కోట్ల విలువ గల 1.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లాలో కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రూ.19.19 కోట్ల విలువ గల 2,541 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.2 కోట్లు లాభం ఆర్జించినట్లు ప్రకటించారు. రాబోయే రోజుల్లో మరిన్ని వ్యాపారాలు చేసి జీడీసీఎంఎస్‌ను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని ఆయన వెల్లడించారు. అనంతరం సమావేశంలో పలు తీర్మానాలు ప్రవేశపెట్టగా, సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. జేసీ భార్గవ్ తేజ పలు ఫైళ్లు, తీర్మానాలపై సంతకాలు చేశారు. సమావేశంలో జీడీసీఎంఎస్ కార్యాలయం మేనేజర్ కె.శ్రీనివాసరావు, పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం విఫలం

- వైఎస్సార్ సీపీ స్టూడెంట్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రవిచంద్ర
- మంత్రి లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్



విద్యాభవన్ ముందు ధర్నా నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ స్టూడెంట్ విభాగం నాయకులు

మంగళగిరి : పదవ తరగతి పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ. రవిచంద్ర ఆరోపించారు. పరీక్షల్లో మాస్ కాపీయింగ్, లీకేజీలను అరికట్టాలంటూ శుక్రవారం గుంటూరు జిల్లా ఆత్మకూరు వద్ద జాతీయ రహదారి పక్కనున్న రాష్ట్ర విద్యాభవన్ కార్యాలయం ఎదుట వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో వైఫల్యానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ఐదు సంవత్సరాల పాలనలో ఒక్క లీకేజీ కాలేదని గుర్తు చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు లబ్ధి చేకూర్చేందుకు పేపర్ల లీకేజీ జరుగుతుందని విమర్శించారు. చంద్రబాబు పాలన అంతా ప్రశ్నపత్రాలు లీకేజీమయం అని దుయ్యబట్టారు. కడపలో మ్యాథ్స్ పేపర్ లీకేజీ ఘటనపై తొమ్మిది మందిని అరెస్ట్ చేయడం దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరు లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాశారని, వారంతా లీకేజీల ఘటనలతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. పరీక్షలలో అక్రమాలకు పాల్పడుతున్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సంఘం నాయకులు కె.శివారెడ్డి, ఐ. శ్రీనివాస్, ఎం. గోపీచంద్, కొండలరావు, సురేష్, ప్రతాప్, పూజిత, నాగరాజు, రాము, సురేంద్ర పాల్గొన్నారు.

నేటి నుంచి పేరంటాళ్లు అమ్మవారి తిరునాళ్లు



అచ్చంపేట: ఉగాది మహోత్సవాల్లో భాగంగా గ్రామదేవత అచ్చమ్మ పేరంటాళ్లమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవాలు శుక్ర, శని, ఆదివారాల్లో మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ కన్వీనర్ సూరే వెంకట సుబ్బారావు గురువారం తెలిపారు. మూడు రోజులపాటు ఉదయం తోరణపాకు అలంకరణతో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. విఘ్నేశ్వర పూజ, కలశస్థాపన, మండపారాధన, అమ్మవారికి పంచామృత స్నానాలు నిర్వహిస్తామన్నారు. చివరిరోజు ఉగాది నాడు అమ్మవారికి ప్రాతఃకాల పూజలతోపాటు కుంకుమార్చనలు, ఉపాధి పచ్చడి ప్రసాదం పంపిణీ కార్యక్రమాలు చేపడతామన్నారు.

ఆప్కో చేనేత వస్త్రాలపై 30 శాతం తగ్గింపు

కొరిటెపాడు(గుంటూరు): ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకొని అన్ని రకాల ఆప్కో చేనేత వస్త్రాలపై 30 శాతం ప్రత్యేక తగ్గింపును అమలు చేస్తున్నట్లు విజయవాడ మండల వాణిజ్య అధికారి డి.వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని రకాల చేనేత వస్త్రాలపై 50 శాతం వరకు తగ్గింపు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రజలంతా తమకు సమీపంలోని ఆప్కో విక్రయశాలలను సందర్శించాలని ఆయన కోరారు. వెంకటగిరి, మాధవరం, రాజమండ్రి, బందరు, చీరాల, ఉప్పాడ చీరలు, ధోవతులు, దుప్పట్లు, లుంగీలు, షర్టింగ్, టవల్స్ తదితర వస్త్రాలను కొనుగోలు చేసి చేనేత పరిశ్రమను ప్రోత్సహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నాటక కళ పరిరక్షణ అందరి బాధ్యత



పురస్కారాలు అందుకున్న కళాకారులు

- మిర్చి యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు
- పలువురికి రంగస్థల, ఉగాది పురస్కారాలు ప్రదానం

నగరంపాలెం: సర్వ కళా సమాహారం నాటకమని, ఇటువంటి కళను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మిర్చి యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు అన్నారు. ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళా వేదికపై కళా విపంచి (హైదరాబాద్), ఆరాధన ఆర్ట్స్ అకాడమి (గుంటూరు), నటరత్న ఎన్.టి.ఆర్. కళాపరిషత్ సంయుక్తంగా రెండు రోజులపాటు నిర్వహించనున్న రంగస్థల పురస్కారాల సభ గురువారం రాత్రి ప్రారంభమైంది. పిన్నమనేని మృత్యుంజయరావుకు గురజాడ పురస్కారం, బసవరాజు జయశంకర్‌కు బళ్లారి రాఘవ పురస్కారం, వైవీఆర్ ఆచార్యులకు పీఎస్ఆర్ రస్కారం, సుంకర కోటేశ్వరరావుకు గరికపాటి రాజారావు పురస్కారం, సురభి సంతోష్‌కు గోవిందరావు పురస్కారం, తిరుమలాబీకి రఘురామయ్య పురస్కారం, డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబుకి వై.కే.నాగేశ్వరరావు పురస్కారం, జ్యోతికి జాముస రాయలు పురస్కారం, మల్లాది భాస్కర్‌కు జంధ్యాల పురస్కారం అందించి, సత్కరించారు. తొలుత ఆలాపన వెంకటేశ్వరరావు, మునిపల్లె రమణ సినీ భక్తి గీతాలు ఆలపించారు. రచయిత, సినీ నటుడు యు.సుబ్బరాయశర్మ, భారత మంత్రిత్వ శాఖ నిపుణులు డాక్టర్ ఎస్.రామచంద్రరావు, ఆలయ పాలకమండలి అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, కళా పోషకులు నూతలపాటి సాంబయ్య, ఉప కార్యదర్శి వూటుకూరి నాగేశ్వరరావు ప్రసంగించారు. బొప్పన నరసింహారావు, డి.తిరుమలేశ్వరరావు, వెంకటేశ్వరరావు, భాగి శివశంకరశాస్త్రి, జీవీజీ శంకర్, జానీబాషా, మధుసూదనరావు పర్యవేక్షించారు.

నృసింహుని హుండీ ఆదాయం రూ. 38.70 లక్షలు



మంగళగిరి టౌన్ : పట్టణంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ హుండీలను గురువారం దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది లెక్కించారు. దేవస్థానానికి సంబంధించి ఎగువ, దిగువ సన్నిధులు, ఘాట్ రోడ్డులో ఉన్న శ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాలకు మొత్తం రూ. 38,70,176లు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఎగువ సన్నిధి హుండీ ఆదాయం రూ.16,13,384, దిగువ సన్నిధి హుండీ ఆదాయం రూ. 21,76,972, ఘాట్ రోడ్డులోని శ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ. 43,011తో పాటు అన్నదానానికి రూ. 36,809 వచ్చినట్లు సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి రామకోటిరెడ్డి తెలిపారు. గతంలో మూడు నెలలకు గాను రూ. 50,97,560 వచ్చిందని, ఇప్పుడు ఒక నెల ముందుగా లెక్కింపు కారణంగా రూ. 12,27,844 తక్కువ వచ్చినట్లు ఆయన వివరించారు. లెక్కింపును కాజ గ్రూపు దేవస్థాన కార్యనిర్వహణాధికారి పి. వెంకటరెడ్డి పర్యవేక్షించారు.